

# ఆగంతకుడు

డాక్టర్ ఎమ్. సుగుణరావు

మాణిక్యాలరావు తన నియోజక వర్గానికి బయలుదేరాడు కారులో. ఐదేళ్ల తరవాత అదే మొదటిసారి వెళ్లడం - ఈ ఐదేళ్లలో మాణిక్యాల రావులో మార్పుంది కానీ, ఆ ఊళ్లో లేదు. సన్నగా పీలగా ఉండే అతను బొద్దుగా తయారయాడు. ఐదు వేళ్లకు ఉంగరాలు, నెలకు వేలమీద వడ్డీ ఇచ్చే బ్యాంకు బాలన్సుతోపాటు తూర్పుగోదావరి ప్రాంతంలో బంగారం పండే భూముల్ని ఏర్పరచుకున్నాడు.

అలా శరీరంలో భౌతిక మార్పుల్ని ఆర్థిక రంగంలో పురోగతిని సాధించిన అతను రాబోయే ఎలక్షన్లను దృష్టిలో ఉంచుకొని తన నియోజక వర్గానికి వెళుతున్నాడు. క్రితం ఎలక్షన్లలో గెలిచిన తరువాత పిల్లల చదువులు ఆ ఊరి పాకబడిలో సాగవని కుటుంబంతో సహా సిటీలో మకాం పెట్టేశాడు. పైరవీలతో రాష్ట్ర, దేశ రాజధానుల్ని చుట్టిరావడం వలన


సొంత ఊళ్ళోకి అడుగుపెట్టే టైము కుదరలేదు. ఏదైనా పనుంటే ఆ ఊరి పెద్దలే వచ్చి కలిసేవారు. కలిసిన వాళ్ల పనులు "చూద్దాం" అని తప్పించుకునే వాడే కానీ ఎప్పుడూ 'చేద్దాం' అనలేదు "బాబు మంచోడే, చేద్దామనే ఉంటుంది, ... కానీ అవతలి వాళ్ళు సహక రించొద్దూ..." అనే అభిప్రాయం ఊళ్ళో వాళ్ళకి కలిగించాడు. ఇక ఎలక్షన్లు ఎలాగూ దగ్గర కొస్తున్నాయి కాబట్టి అందరినీ ఆశ్చర్యంలో ముంచేద్దామని ఎవరికీ చెప్పకుండా హఠాత్తుగా బయలుదేరాడు, బ్రీఫ్‌కేసులో 'లక్ష్మి'ని జాగ్రత్త చేసి, అపోజిషన్ వారికన్నా ముందే డబ్బు పంచేస్తే సెంటిమెంటుతో ఓటర్లను కట్టి పడెయ్యవచ్చు అనే 'దూ'రాలోచన కూడా వుంది.

- ఊరు ఇంకా పది కిలోమీటర్ల దూరంలో ఉంది. దూరంగా కొండలు... కొండల క్రిందుగా కనిపించినట్లే కనిపించి దగ్గరయ్యే కొద్దీ దూరమవు తున్నట్టనిపిస్తోంది. ఊరు చూడగానే మాణిక్యాల రావులో హుషారు అధికమై తన గతాన్ని పునరావ లోకనం చేసుకున్నాడు. ఏ స్థితిలోంచి ఇంతపై కెదిగాడో అతడి కళ్ల ముందు మెదులుతోంది. - ఆ వూళ్లో తన జీవితం పూల పాన్పు మీద నడవలేదు. మండలాఫీసులో తండ్రి చేసే అటెండరు ఉద్యోగంతో ఇంటిల్లిపాదికీ ఐదువేళ్లు వెళ్లేవి కాదు. తాను స్కూల్ ఫైనలు వరకూ నెట్టుకొచ్చినా పరీక్ష ఫెయిలవడంతో రోడ్డు మీద కొచ్చాడు. టైము దొరకడంతో తన ఈడు వాళ్లను చేరదీసి నాయకుడి పాత్ర వహించాడు. అదే తన రాజకీయ జీవితానికి పునాది అయింది. వీధి లైట్లు వేయించడానికో పిటీషను, సన్నకారు రైతులకు ఎరువు లివ్వమని అర్జీ పెట్టడం, ఆసు పత్రికి డాక్టరు లేడని కలెక్టరుగారికి కంప్లయింటు,

ఇలా తను ప్రజల మనిషి అయ్యాడు. ఈలోగా తండ్రి హఠాత్తుగా కాలధర్మం చెందడంతో తండ్రి ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరినా తన సమాజసేవా కార్యక్రమాలు మానుకోలేదు. అందరూ కోరడంతో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి సర్పంచ్‌గా నిలబడి ఏకగ్రీవంగా గెలుపొందాడు. సంవత్సరంలో ఏవో పనులు సాధించి పేరు తెచ్చుకున్నాడు. అంతే, తన రేఖ మారిపోయింది. రాష్ట్ర నాయకుల దృష్టిలో పడ్డాడు. తాను యువకుడనే ఉద్దేశంతో ఎన్నికలలో టిక్కెట్టిచ్చారు. విజయలక్ష్మి వరించింది. అంతే - తన స్టేటస్ మారిపోయింది. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యే ముందు చేసిన సేవలో వీసమెత్తు కూడా చెయ్య లేదు... కారు గోతిలో పడడంతో ముందుకు తూలి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. గతుకుల రోడ్డు మీద కారు అతి కష్టంగా పోతోంది. "ఛీ... వెధవ రోడ్డు ఎవడు వేయించాడో" అనుకోబోయి నాలిక్కరుచుకున్నాడు. బావమరిది పేరుతో కాంట్రాక్టు సంపాదించి తనే రోడ్డు వేయించిన విషయం గుర్తొచ్చింది. తనేం చెయ్యగలడు? ఈ రోడ్డు నిర్మాణానికి తను చెయ్యాల్సిందంతా చేశాడు, వర్షాల్లో పొడయి గుంట లేర్పడడానికి తాను బాధ్యుడా? వారం రోజుల క్రితం పేపర్లో తనపై వచ్చిన విమర్శ మదిలో మెదిలింది. తన తప్పులేదు, అకాల వర్షం కురిపించిన ఆ దేవుడిదే తప్పు అనుకుని సంతృప్తి పడ్డాడు.

- ఊరు దగ్గరవుతున్న కొద్దీ అతడిలో ఆనందం అధికం కాసాగింది. ఆ వూళ్లో అరగంట కన్నా ఎక్కువ గడపలేడు. ఛోటా నాయకుల్ని కలిసి డబ్బు పంచేస్తే చాలు గెలవడం ఖాయం. ఈసారి గెలిస్తే మంత్రి పదవి సునాయాసంగా వస్తుంది, ఎలాగోలా గెలిచి తీరాలి. - అలా భవిష్యత్తు గురించిన ఆలోచనల్లో వున్నవాడల్లా కారును ఆపమని సైగ చేస్తున్న నలుగురిని చూసి - 'డ్రైవర్ కారాపు' అన్నాడు. వెంటనే డోర్ తెరిచి నవ్వుతూ బయటి కొచ్చి "ఏం బాబూ, ఏం కావాలి మీకు" , సౌమ్యంగా చెప్పేడు...

"నువ్వురా బాబూ!" అందులో ఒకడు మాణిక్యాలరావు చొక్కా పట్టుకున్నాడు. మాణిక్యాల రావుకు మతిపోయింది. "నీ చేతి ఉంగరాలు తీసివ్వు!" ఇంకొకడు అరిచాడు. వారి దౌర్జన్యానికి గుండెలు జారిపోయాయి. తన ఊరి ప్రజలని పొరపాటు పడ్డాడు. దారి దొంగలని అర్థమయ్యే సరికి ముచ్చెమటలు పోశాయి. డ్రైవరు కారులోని ఇనుపరాడ్ తియ్యబోయాడు. వారంతా అతన్ని తోసి నెత్తిమీద బలంగా కొట్టారు. డ్రైవరుకు వెంటనే స్పృహ తప్పింది. మాణిక్యాలరావు ఉంగరాలు,



## బాలీవుడ్ బాణీ



మీరు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న తీసుకోకపోయినా ఇది మాత్రం నిజం... అందాల ముద్దు గుమ్మ మమత కులకర్ణికి కూడా రాజకీయాల్లోకి దిగిపోవాలనే ఆలోచన అకస్మాత్తుగా వచ్చింది. నటిగా రాణించడంతో పాటు రాజకీయ నేత్తగా, దర్శకురాలిగా కూడా పేరు తెచ్చుకోవాలన్నది ఆమె అభిలాషట. "నాకు రాజకీయాలంటే చాలా ఇష్టం. శివసేనలో చేరాలని ఇష్టపడుతున్నాను. సంజయ్ విషయంలో బాల్‌థాకర్ చేసిన కృషి నిజంగా ప్రశంసనీయం" అని పొగిడేసింది. అంతేకాదు ఏదో ఒక రోజు దర్శకురాలిని కూడా అయిపోతానని చెబుతోంది... చూద్దాం.....

మసూద్ అన్సారి

వాచీ లాక్కున్నారు. "నేనెవరో తెలీదా మీకు? దయచేసి నన్నొదిలెయ్యండి" చేతులు జోడించాడు. "నువ్వెవరో మా కనవసరం" అంటూ అతడి పట్టులాల్చీ, పంచెతోపాటూ బ్రీఫ్‌కేసు కూడా లాక్కుని పారిపోయారు. డ్రాయరు, బనీనుతో మిగిలి కుమిలిపోతూ నిలబడ్డాడు. ఊరు చేరాలంటే ఇంకో ఐదు కిలోమీటర్లు నడవాలి. వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ పరిగెత్తడం ప్రారం భించాడు. అతడు వేయించిన రోడ్డు మీది గతుకుల్లో పడుతూ లేస్తూ పరిగెడుతున్నాడు.

చీకటి అలుముకుంటోంది. ఎక్కడా నర సంచారం లేదు. పంటచేలల్లో పక్షుల కిలకిలా రావాలు శ్రావ్యంగా వినిపిస్తున్నా అతడికి ఆ ఒంటరితనంలో భయం కలిగిస్తున్నాయి. బాటకు ఇరు ప్రక్కలా ఉన్న చెట్లు ఎండతరిమే దయ్యాలా అనే భ్రమను కలిగిస్తున్నాయి. ఎంతో మంది విజ్ఞప్తులు పంపినా ఆ ఊరికి బస్సు వేయించ నందుకు తగిన శాస్తి జరిగిందని బాధ పడుతూ పరిగెడుతున్నాడు. ఒంటినించి ధారాపాతంగా చెమటలు కారుతున్నా తొందరగా ఊరు చేరాలన్న తపనతో, సంధించిన బాణంలా పరిగెడు తున్నాడు. ఇంతలో చీకట్లో చిరుదీపంలా పొలంగట్ల మీద ఆ ఊరి రైతులు కనిపించారు. 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకొని వారిని కేకలు వేసి పిలిచాడు. ఆ కేకలకు వచ్చిన వారంతా ఆ స్థితిలో అతడి వాలకాన్ని విచిత్రంగా చూశారు. "మీరు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధిని, దారి దొంగల దోపిడికి గుర య్యాను. నన్ను రక్షించండి..." అన్నాడు ప్రాధేయపడుతూ. వారు అతణ్ణి పైనించి



కిందవరకూ చూశారు. అతడి మాటలు వారికి అర్థం కాలేదు' ఎవరీ వ్యక్తి? అంటూ ఆలోచనల్లో పడ్డారు. వారిలో ఎన్నో ప్రశ్నార్థకాలు! హఠాత్తుగా కనిపించిన ఈ వ్యక్తి తాము ఎన్నుకున్న మాణిక్యాలరావా?! వారికి నమ్మకం కలగలేదు. - అర్దనగ్నంగా దుమ్ము కొట్టుకుపోయిన శరీరంతో వున్న ఆ ఆగంతకుడు తాము గెలిపించిన వ్యక్తి అంటే వారికి ఆశ్చర్యం కలిగింది. ఐదేళ్ల క్రితం తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని వారెరుగుదురు. లావుగా, బాగా పెరిగిన పొట్టతో పూర్తిగా మారిపోయిన మాణిక్యాల రావును వారు గుర్తుపట్టలేకపోయారు' "ఒరేయ్ వీడెవడో పిచ్చోడిలా వున్నాడురా. మనకెందుకు పోదాం పదండి..." అనుకుంటూ అతడిని పట్టించుకోకుండా వెనుతిరిగారు.

మాణిక్యాలరావు కుప్పకూలిపోయాడు. ఏమి టిలా జరిగింది?! ఎవరో కావాలని చేశారా, నిజంగా ఇలా జరగడం కాతాళీయమా! అతడిలో అనేక ప్రశ్నలు. రకరకాల భయాలు. కాసేపు అంతర్మథనం చెందిన తరువాత అతనికి చూచా యగా ఒక విషయం మాత్రం అవగమయింది.

-"ఔను వారు తనను గుర్తుపట్ట లేదంటే, వారి తప్పు కాదు. ఈ ఐదేళ్లలో తను ఒక్కసారీ ఆ ఊరికి రాలేదు. ఇదివరకూ వాళ్లలో ఒకడుగా మెలిగిన తను, పదవి రావడంతో వారికి దూర మయ్యాడు. స్వాగతసత్కారాలు ఆశించిన తనకు తగిన పరాభవమే ఎదురయింది. వాళ్లను మరిచిపోయిన తను, - వాళ్లూ అలాగే తననూ మరిచిపోతారని ఊహించలేక పోయాడు... ఇది ముమ్మాటికీ నిజం..." అలా అనుకుంటూ బాధ పడ్డాడు మాణిక్యాలరావు. - ఆ తర్వాత మాణిక్యాలరావు ఏం చేశాడు?! ఆ ఊరిని బాగు చేశాడా? అనేది అప్రస్తుతం. కాని, ప్రజాస్వామ్య భారతావనిలో ప్రజలు ఎన్ను కున్న ప్రతినిధులు ఆ ప్రజల్ని మరిచిపోతే ఏం జరుగుతుందో ఆ సంఘటన నిరూపించింది. అవును! అలాగే జరగాలి!